
# సాక్షి గుంటూరు

శుక్రవారం । 12 । మే । 2023



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 521.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,200 వరకు పలికింది.



## మహా యజ్ఞం ఏర్పాట్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడలో మహా యజ్ఞానికి పక్కా ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు.

## న్యూస్‌రీల్

### లేఅవుట్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్



మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలోని ఆర్–5 జోన్‌లో పేదలకు కేటాయించిన నివేశన స్థలాల్లో చేపట్టిన లేఅవుట్ అభివృద్ధి పనులను పగలు – రాత్రి నిర్విరామంగా కొనసాగించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం ఆయన నగర పరిధి నవులూరు, యర్రబాలెం లోని లేఅవుట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. లేఅవుట్‌లలో ప్రస్తుతం జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైన కార్మికులతో పాటు ఉపాధి కూలీలను కూడా నియమించుకోవాలన్నారు.

**పనులను పరిశీలించిన జేసీ...**

మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలోని ఆర్–5 జోన్‌లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన నివేశన స్థలాలకు సంబంధించిన లేఅవుట్ అభివృద్ధి పనులను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. సీఆర్‌డీఏ పరిధిలోని నవులూరు లేఅవుట్‌లో హద్దురాళ్ల పాతే పనులను ఆమె స్వయంగా పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. లేఅవుట్ అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పర్యవేక్షించడంతో పాటు వేగవంతం చేయించాలన్నారు. అనంతరం ఆమె యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రులో జరుగుతున్న లేఅవుట్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

### యార్డులో 1,06,849 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 98,889 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,06,849 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ. 9,000 నుంచి రూ. 23,800 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,218 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

### ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

మంగళగిరి: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సస్పెండ్ చేశారు. గత నెల 22వ తేదీ అర్ధరాత్రి మంగళగిరి రూరల్ స్టేషన్‌లో గంజాయి బస్తా మాయమైన వ్యవహారంలో రూరల్ ఎస్‌ఐ రమేష్‌బాబు, రైటర్ బ్రహ్మయ్య, కానిస్టేబుల్ సదాశివరావులపై సస్పెన్షన్ వేటు పడింది. రూరల్ స్టేషన్‌లో మాయమైన గంజాయి బస్తా వ్యవహారంపై అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. అడిషనల్ ఎస్పీ విచారణ చేపట్టి నివేదికను ఇటీవల ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌కు అందజేశారు. ఈ నివేదిక మేరకు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రూరల్ ఎస్‌ఐ రమేష్‌బాబు, రైటర్ బ్రహ్మయ్య, సెంట్రీ సదాశివరావులను సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

**రూరల్ ఎస్‌ఐగా క్రాంతి కిరణ్...**

మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా క్రాంతి కిరణ్‌ను నియమిస్తూ అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ఎస్‌ఐ రమేష్ బాబు స్థానంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న క్రాంతి కిరణ్‌ను రూరల్ ఎస్‌ఐగా బదిలీ చేసి ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఉత్తమ విద్యకు ఆదర్శ

- మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి మొదలైన దరఖాస్తుల స్వీకరణ
- పేద విద్యార్థులకు మంచి అవకాశం
- జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఈ నెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం
- ఒక్కో పాఠశాలలో 100 సీట్ల కేటాయింపు
- జిల్లాలో 14 మోడల్ పాఠశాలలు



నకరికల్లు మండలం దేచవరం మోడల్ పాఠశాల

సత్తెనపల్లి: మోడల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గతంలో ఒక్కో పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు మాత్రమే ఉండేవి. విద్యార్థుల డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఒక్కో పాఠశాలలో 100 సీట్లకు పెంచింది. జిల్లావ్యాప్తంగా 14 మోడల్ పాఠశాలల్లో 1,400 సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ఈపూరు, బొల్లాపల్లి, చీకటీగలపాలెం, చిరుమామిళ్ల, దాచేపల్లి, దేచవరం, దుర్గి, గురజాల, జెట్టిపాలెం(గోలి), కారంపూడి, క్రోసూరు, నూజెండ్ల, వెల్దుర్తి, విపర్ల రెడ్డిపాలెంలో మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

**దరఖాస్తు చేసుకోవడం ఇలా ...**

అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా పరీక్ష రుసుం చెల్లించిన తరువాత ఒక నెంబరు కేటాయిస్తారు. దాని ఆధారంగా ఏదైనా ఇంటర్నెట్ కేంద్రంలో ఠీఠీఠీ. ్చఞఝట ్చఞ జౌరి. జీఽ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తరువాత నకలును సంబంధిత మోడల్ పాఠశాలలో సమర్పించాలి. ఓసీ, బీసీలకు రూ .150, ఎస్సీ,ఎస్టీలకు రూ .75 గా నిర్ణయించారు.

> దివంగత మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఏపీ మోడల్ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. మహానేత రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నేడు మోడల్ పాఠశాలలు విప్లవాత్మక ఫలితాలను సాధిస్తున్నాయి.

**అర్హతలు ఇవీ ...**

ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబరు ఒకటి, 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య పుట్టి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వారైతే 2009 సెప్టెంబరు 1, 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2021–22, 2022–23 విద్యా సంవత్సరాలు చదివి ఉండాలి. 2022–23 విద్యా సంవత్సరంలో అయిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

**ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా..**

జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయా మోడల్ పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఓసీ, బీసీలు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు పొంది ఉండాలి. ఇందులో పొందిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. పరీక్ష ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. పూర్తి వివరాల కోసం మండలాల్లోని మోడల్ పాఠశాలల్లోని ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి. జూన్ 16న మెరిట్ జాబితా ప్రకటిస్తారు. మెరిట్ లిస్టును బట్టి రోస్టర్ ప్రామాణికంగా సీట్లను కేటాయిస్తూ జూన్ 18న జాబితాను విడుదల చేస్తారు. 19న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది. జూన్ 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# మెప్మా సీఎంఎం సస్పెన్షన్

ముగ్గురు ఆర్పీలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: తప్పుడు ధ్రువ పత్రాలతో యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను బురిడీ కొట్టించి రూ.1.05 కోట్లు మోసం చేసిన వైనంపై గురువారం 'సాక్షి'లో 'మెప్మా సిబ్బంది చేతివాటం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మెప్మా ఎండీ(మిషన్ డైరెక్టర్) విజయలక్ష్మి స్పందించి ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎంఎం(సిటీ మిషన్ మేనేజర్) దీపను సస్పెండ్ చేయడంతో పాటు, ఆర్పీలు సబిత, పుష్పలత, కనకలతలను విధుల నుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వుల కాపీని గుంటూరు జిల్లా మెప్మా కార్యాలయానికి మెయిల్‌లో పంపించినట్లు పీడీ వెంకటనారాయణ తెలియజేశారు. సీఎంఎం దీప స్థానంలో శ్యామలను నియమించినట్లు చెప్పారు. లోన్ రికవరీ పూర్తిగా బాధ్యులే చేయాలని లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.



నూతన కార్యాలయంలో మంత్రి అంబటి, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, తదితరులు

# వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- రాష్ట్రంలో సుభిక్ష పాలన : మంత్రి అంబటి రాంబాబు



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో సంక్షేమ సారథిగా పేరుగాంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుభిక్ష పాలన అందిస్తున్నారన్నారు.

**పేదల పక్షపాతి..**

పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో 50వేల కుటుంబాలకు ఇళ్లు ఇవ్వడం ద్వారా పేదల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా కేవలం ఐదురోజుల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు .

**ఒకే మాట.. ఒకే బాటగా సాగుతాం..**

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరం ఒకే మాటగా, ఒకేబాటగా ముందుకు సాగుతామన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో ఏడు అసెంబ్లీలు, ఒక పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడేలా పాటుపడతామన్నారు. మొదటి సంతకం నుంచి ఇప్పటి వరకు సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తూ సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. సీయూసీ సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణ (ఆచారి), మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వై.షేక్, కృష్ణమోహన్, మురళి, పానుగంటి చైతన్య, వినోద్, మేరిగ విజయలక్ష్మి, ఆవుల సుందర రెడ్డి, గనిక ఝాన్సీ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# చేనేతకు 'పన్ను'పోటు

**జీఎస్టీతో నేతన్న కుదేలు**

- నూలు, రంగు, రసాయనాల ధరలు పైపైకి..
- ఒక్క బారపై పలురకాల జీఎస్టీ
- ఆందోళనకు సిద్ధమైన చేనేత కార్మికులు

చీరాల: కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ చేనేత రంగాన్ని చిదిమేస్తోంది. వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్ద ఉపాధి రంగమైన చేనేత రంగం అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటుంటే కేంద్రం చివరకు చేనేత రంగంపై కూడా జీఎస్టీ విధించడంతో ఈ రంగంపై పెనుభారం మోపినట్లయింది. చేనేత పరిశ్రమ జీఎస్టీతో చావుదెబ్బ తగిలి వస్త్ర పరిశ్రమ ఊసురుమంటుంది. ఇతర ఉత్పత్తులకు ఒకే రకమైన జీఎస్టీ అమలవుతుంటే చేనేత వస్త్రాలపై విభిన్న రకాల జీఎస్టీ అమలువుతున్నాయి. చిలపనూలు నుంచి రంగు, రసాయనాలపై తయారైన వస్త్రాలపై విభిన్న రూపాల్లో జీఎస్టీ విధిస్తున్నారు. అంటే చేనేత మగ్గంపై తయారయ్యే వస్త్రాలపై 30 శాతం వరకు జీఎస్టీ పడుతుంది. దీని ప్రభావం కారణంగా జిల్లాలో ఇప్పటికే 25 శాతం మగ్గాలు మూలన పడ్డాయని అంచనా. జిల్లాలోని చీరాల, వేటపాలెం, మార్టూరు, రేపల్లె తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

**చేనేత పరిశ్రమకు కేరాఫ్ చీరాల..**

జిల్లాలో చీరాల నియోజకవర్గంలోనే చేనేతలు అధికంగా ఉన్నారు. రోజుకు జిల్లాలో చేనేతలు సరాసరి లక్ష మీటర్ల చేనేత వస్త్రాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 70 శాతం వస్త్రాలు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. సాధారణ చొక్కాలు, ఊలు చీరలు, పంజాబీ డ్రస్సులు మొదలు అత్యంత నాణ్యమైన జాకార్డు రకాలైన కుప్పడం, ఆల్‌ఓవర్, బిట్‌సెల్ఫ్, బిట్‌కట్‌తో పాటుగా పట్టు చీరలు, కాటన్ పట్టు వస్త్రాలను మన రాష్ట్రంలోని పేరెన్నికల ప్రాంతాలతో పాటుగా, ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ప్రధాన ప్రాంతాలకు చీరాల నుంచి చేనేత వస్త్రాలు ఎగుమతి చేస్తుంటారు. కుప్పడం వంటి చీరలకు భౌగోళిక గుర్తింపు లభించింది.

**చేనేత వస్త్రాలపై బహుళ పన్నులు..**

గతంలో ఎన్నడూ లేని విధంగా జీఎస్టీ అమలతో చేనేత రంగంపై పన్ను పోటు పడింది. కేవలం చీరలపైనే కాకుండా అనుబంధంగా ఉన్న వాటిపై జీఎస్టీ అమలు కావడంతో చేనేతలు ఆధారం కోల్పోతున్నారు. నూలుపై 5 శాతం, రంగులపై 18 శాతం, రసాయనాలపై 18 శాతం, తయారైన వస్త్రాలపై ఖరీదును బట్టి 5 నుంచి 12శాతం జీఎస్టీని అమలు చేస్తున్నారు. దీని ఫలితంగా ఒక్కో చీరపై 30 శాతం జీఎస్టీ పడుతుంది. బహుళ పన్నుల కారణంగానే చాలామంది మాస్టర్ వీవర్లు, కార్మికులు చేనేత రంగం నుంచి నిష్క్రమిస్తున్నారు. చేనేత రంగం రోజురోజుకు కుదేలవుతున్నా చేతి వృత్తులపై భారీస్థాయిలో జీఎస్టీ, బహుళ పన్నుల కారణంగా తాము పూటగడవని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని కార్మికులు వాపోతున్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వకపోతే చేనేత రంగం కనుమరుగయ్యే ప్రమాదం పొంచిఉంది.

**ఆందోళన బాటలో కార్మిక సంఘాలు..**

చేనేత వస్త్రాలపై జీఎస్టీని మినహాయించాలని ఇప్పటికే పలు చేనేత కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాయి. చేనేత జాగృతి కార్యక్రమాన్ని చీరాలతో పాటు జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా పలు చేనేత కార్మిక సంఘాలు నిర్వహించాయి. అలానే చేనేత జన సమాఖ్య, చేనేత కార్మిక మిత్రమండలి, ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనలు, నిరసన దీక్షలు నిర్వహించారు. చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. జీఎస్టీ అమలు తర్వాత నూలు బారుకు రూ.100 పెరిగింది. జీఎస్టీకి ముందు బారుకు రూ.940 ఉన్న ధర జీఎస్టీ అమలు తర్వాత రూ.1040కి పెరిగింది. పట్టు కిలో జీఎస్టీకి ముందు రూ.4300, జీఎస్టీ తర్వాత రూ.4800. పట్టు చీర జీఎస్టీకి ముందు రూ.2800, జీఎస్టీ అమలు తర్వాత రూ.3000. బిట్ సెల్ఫ్ చీర జీఎస్టీకి ముందు రూ. 1800, జీఎస్టీ అమలు తర్వాత రూ.1950. కుప్పడం జీఎస్టీకి ముందు రూ.3750, జీఎస్టీ అమలు తర్వాత రూ.4050. ఇదే కాకుండా తయారైన చీరపై 12 శాతం పెరిగింది.


**జీఎస్టీ ఎత్తివేయకుంటే ప్రమాదంలో పరిశ్రమ..**

> చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం విధించిన పలు రకాల జీఎస్టీలు ఎత్తివేయకుంటే ఆ రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. నూలు, రంగు, రసాయనాలు, ముడి పదార్థాలు, తయారైన చీరలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధిస్తోంది. ఒక చీర తయారయితే 20–30 శాతం జీఎస్టీ పడుతుంది. ప్రస్తుతం జీఎస్టీ ఎత్తివేయాలని వారు ఉద్యమాలు చేస్తున్నారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందించి చేనేతలకు పూర్వవైభవం తీసుకురావాలి. – కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే, చీరాల

# థ్యాంక్యూ సిస్టర్

## నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

- నర్సులు.. సేవకు ప్రతిరూపాలు
- అధిక సంఖ్యలో నర్సులను నియమించిన ప్రభుత్వం
- పీహెచ్‌సీల్లో సైతం ముగ్గురు చొప్పున నర్సులు



రోగికి సేవ చేస్తున్న నర్సులు

గుంటూరు మెడికల్: ఆసుపత్రిలో 24గంటలూ రోగి పడకవద్దే ఉండి చిరునవ్వుతో వైద్యసేవలందిస్తూ వ్యాధి నుంచి రోగి కోలుకోవటంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తారు. అనారోగ్యంతో ఉన్న వారిని సొంతవారే ఈసడించుకుంటున్న నేటి దినాల్లో రోగులకు ఆప్యాయంగా సేవలు అందిస్తూ మానవత్వపు విలువలున్నాయని నిరూపించుకుంటుంది నర్సులు మాత్రమే అనటంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. కాలిన గాయలు... కుళ్లిన శరీరభాగాలు... గాయపడి, రక్తమోడుతూ దుర్గంధం వెదజల్లే శరీరాలకు నర్సులు సేవలను అందిస్తారు. సేవకు ప్రతిరూపంగా చెప్పుకొనే నర్సుల దినోత్సవాన్ని ఏటా మే 12న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

**ఇదీ నేపథ్యం..**

లేడీ విత్ ది ల్యాంప్ గా పేరు గాంచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820 మే 12న ఇటలీలో జన్మించారు. 1854–56 లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ తోటి నర్సుల సహాయంతో యుద్ధంలో గాయాలైన సైనికులకు నిరుపమానమైన సేవలందించింది. వారికి ధైర్యమూ చెప్పింది. నర్సులు చేసిన సేవలవలన యుద్ధంలో మరణించే రోగుల సంఖ్య బాగా తగ్గింది. యుద్ధంలో దెబ్బ తిన్న ప్రతి సైనికుడికి తాను కోలుకుంటానన్న ఆశ చిగురింపచేసేలా ఆమె వైద్య సేవలందించింది. ఆమె సేవలను గుర్తించి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా మే12న ఫ్లొరెన్స్ నైటింగేల్ జయంతి రోజున నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

**నర్సులు అందించే సేవలు...**

ఆసుపత్రిలో డాక్టర్ల తరువాత అత్యంత కీలకమైన పాత్ర నర్సులదే. ఆసుపత్రికి నర్సులు వెన్నుముక లాంటివారు. నిత్యం తెల్లటి వస్త్రాలు ధరించి రోగుల పడకల వద్దే ఉంటూ వారికి వైద్య సాయం అందించడంతోపాటు, మానసిక స్థైర్యాన్ని సైతం కల్పిస్తుంటారు. వార్డులో ఉంటున్న రోగులకు కావాల్సిన మందులను పంపిణీ చేయటం, వార్డులో ఉండే రోగులకు కావాల్సిన మందులను మెడికల్ స్టోర్ నుంచి ఇండెంట్ పెట్టి తెప్పించటం, రోగుల పడకలను శుభ్రంగా ఉండేలా చేయించటం, ఫ్లూయిడ్స్ ఎక్కించటం, వ్యాధినిర్ధారణ పరీక్షలకు రోగిని పంపించటం, వార్డులో వర్క్‌షాపునకు సంబంధించిన పనులు చూడటం, యూనిట్ చీఫ్, అసిస్టెంట్ డాక్టర్లు రోగులను పరీక్షించేందుకు వచ్చినప్పుడు వారి వెంట ఉండి సహాయం చేయటం, వార్డు శుభ్రంగా ఉండేలా చూడటం తదితర పనులను నర్సులు చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయటం, కాన్పులు చేయటం కూడా నర్సులే చేస్తారు.

**నర్సింగ్ ప్రాధాన్యత గుర్తించిన ప్రభుత్వం...**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. గుంటూరు జిల్లాలో టీచింగ్ ఆసుపత్రి మొదలు పీహెచ్‌సీ వరకు పలు నర్సింగ్ సిబ్బంది పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో 300 మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధుల్లో చేరారు. గుంటూరు జీజీహెచ్‌లో 250 పోస్టులు ఒకేసారి మంజూరు చేసిన ప్రభుత్వం తద్వారా నర్సింగ్ సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకుంది. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సైతం బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ పేరుతో రిక్రూట్‌మెంట్ చేసి గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

**నర్సింగ్ పోస్టులు పెంచినందుకు కృతజ్ఞతలు**



> అధికారంలోకి రాగానే గుంటూరు జీజీహెచ్‌లో 250 స్టాఫ్‌నర్సుల పోస్టులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అధిక సంఖ్యలో పోస్టులు మంజూరు చేయడం ద్వారా రోగులకు మెరుగైన నర్సింగ్ సేవలు అందిస్తున్నాం. పలు రకాల ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. వారు వ్యాధి నుంచి కోలుకుని ఇంటికి వెళ్లి మేము అందించిన సేవలను గుర్తించి ఫోన్లు చేస్తుంటారు. నా తల్లి చంద్ర లీలావతి, పిన్ని సుగుణ కుమారి, ఇరువురు కూడా నర్సింగ్ వృత్తిలో పనిచేశారు. పిన్ని ప్రొత్సాహంతో నర్సింగ్ వృత్తిలో ప్రవేశించాను. పలు ఆసుపత్రుల్లో వివిధ హోదాల్లో రోగులకు సేవలు అందించడం ఎంతో సంతృప్తినిచ్చింది.
>
> – కర్రెద్దుల ఆషా సజని, గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్

**పీహెచ్‌సీకి ముగ్గురు నర్సులు**



> గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే నర్సింగ్ సిబ్బంది ఉండేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నర్సింగ్ సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రతి పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులను నియమించారు. అంతేకాకుండా సబ్ సెంటర్‌లు, సచివాలయాల్లో ఉండే ఏఎన్ఎంలకు సైతం జీఎన్ఎం శిక్షణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.
>
> – డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్ఓ

# విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



కొరిటెపాడు(గుంటూరు): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రైతులు విధిగా లైసెన్స్ పొందిన డీలరు వద్ద అనుమతులు ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే విధిగా రైతులు బిల్లు తీసుకోవాలని, బిల్లుతో పాటు పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న ప్రకారం పేరు, ఫోన్ నెంబరు, లాట్ నెంబరు, విత్తనం బ్రాండ్ తదితర వివరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిల్లు, విత్తనాల సంచిని పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరచుకోవాలన్నారు. ముఖ్యంగా లూజు విత్తనాలు, డూప్లికేట్ ప్యాకింగ్ ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విత్తనాలను విక్రయిస్తే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు ఏ కారణం చేతనైనా పంట దెబ్బతింటే వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు.

## బావను హత్య చేసిన బావమరిది

పిడుగురాళ్లరూరల్: కటుంబ కలహాల నేపథ్యంలో సొంత చెల్లి భర్తను హత మార్చిన సంఘటన గురువారం చోటుచే సుకుంది. వివరాల ప్రకారం... మండ లంలోని జానపాడు గ్రామానికి చెందిన గోపి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తు న్నాడు. వినుకొండ నియోజకవర్గం శావ ల్యాపురం గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కొంత కాలం గా గోపి(35), లక్ష్మిల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పెద్దల సమ క్షంలో సర్దుబాటు చేశారు. జానపాడు గ్రామంలో నిర్వహించిన తిరునాళ్ల సమ యంలో గోపి తాగి భార్య లక్ష్మిని కొట్టి చిత్ర హింసలకు గురి చేశాడు. అంతేకా కుండా రోజు గొడవ పడుతుండటంతో లక్ష్మి తల్లిదండ్రులకు, అన్న ఏడుకొం డలకు సమాచారం అందించింది. దీం తో ఏడుకొండలు తన తల్లిదండ్రులతో కలసి గురువారం జానపాడులోని గోపి ఇంటికి వచ్చాడు. లక్ష్మిని తీసుకొని వెళ్తుండగా గోపి అడ్డు వచ్చి తన ఆటోలో ఉన్న కత్తిని తీసుకొని ఏడుకొండలుపైకి వెళ్లాడు. వెంటనే ఏడుకొండలు తోపు లాటలో గోపి వద్ద ఉన్న కత్తి లాక్కొని గొంతులో పొడిచాడు. గోపిని పట్టణం లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిం చగా మరణించాడు.



## ఐటీఐల్లో తొలి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

**జూన్ ఆరో తేదీలోగా దరఖాస్తులకు అవకాశం**

తెనాలి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో 2023–24 సంవత్సరానికి తొలి విడత ప్రవేశానికి నోటిఫి కేషన్ జారీ అయినట్టు తెనాలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు జూన్ ఆరో తేదీలోగా 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్' వెబ్ పోర్టల్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి మొదటగా రిజిస్టర్ చేసుకుని, వారికి కేటాయించిన ప్రత్యేక సంఖ్యను గుర్తుపెట్టుకోవాలని, రిజిస్టర్ ప్రక్రియ పూర్తిచేసుకున్న తర్వాత అభ్యర్థి తాను చేరదలచుకున్న ఐటీఐ, ఏ జిల్లాలో ఉందో ఆ జిల్లాను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేయాలని వివరించారు. అనంతరం తమ సర్టిఫికెట్ ధ్రువీకరణ కోసం తమకు దగ్గర్లోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐ (ప్రభుత్వ ఐటీఐ, తెనాలి/ డీఎల్‌టీసీ/ఐ టీఐ, గుంటూరు)లో తప్పనిసరిగా సంప్రదించాలని సూచించారు. సర్టిఫికెట్ ధ్రువీకరణ తేదీలు, కౌన్సెలింగ్ తేదీలు అభ్యర్థులకు ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియపరు స్తారని వివరించారు.

**కొత్తగా డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సు**

2023–24 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో ఆరు నెలల కాలపరిమితి కలిగిన డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలి పారు. కోర్సు వివరాలు, అడ్మిషన్ ప్రక్రియకు సంబంధి చిన సమాచారం, సందేహాలకు తెనాలి ప్రభుత్వ ఐటీఐను సంప్రదించాలని లేకుంటే 8686689234/9014491772 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి



హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు (ఫైల్)

మంగళగిరి: నార్త్ సబ్ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెం దారు. పోలీసుల కథనం ప్రకారం. నగరంలోని నార్త్‌సబ్ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస రావు బుధవారం తన ద్విచక్ర వాహనంపై కార్యాలయా నికి వస్తుండగా మార్గమధ్యలోని ఆత్మకూరు వీజే కళాశాల వద్ద స్పీడు బ్రేకర్ తప్పించబోయి అదుపుతప్పి పడిపో యాడు. ఘటనలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాల య్యాయి. గమనించిన స్థానికులు పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా ప్రాం తానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిం చారు. తలకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టే బుల్ శ్రీనివాసరావు గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు 1996లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 2015లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. శ్రీనివాసరావు భౌతికకాయాన్ని నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబు, పట్టణ సీఐ బి.అంకమ్మరావుతో పాటు పలువురు సిబ్బంది సందర్శిం చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గంజాయి బ్యాచ్‌తో కలిసి మహిళలపై దాడి

- పోలీస్‌స్టేషన్‌కు వెళితే నరికేస్తామంటూ బెదిరింపులు
- తాడేపల్లి ప్రాంతంలో ఓ వ్యక్తి హల్‌చల్
- భయభ్రాంతుల్లో మహిళలు
- కేసు పెట్టి చేతులు దులిపేసుకున్న పోలీసులు
- ఇళ్లకు వెళ్లేందుకు భయపడుతున్న అబలలు
- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్దే పడిగాపులు



పోలీస్‌స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో సెటిల్ మెంట్లు చేస్తూ జనాలను భయభ్రాంతులకు గురిచే స్తున్న బొల్లొద్దుల అనిల్ అనే వ్యక్తి తాజాగా మహి ళలు, చిన్నపిల్లలపైనా దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడు తుండడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. బాధిత మహిళల కథనం ప్రకారం.. తాడేపల్లిలోని ముగ్గురోడ్డు సెంటర్‌లో నివాసముండే బొల్లొద్దుల అనిల్ సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తుంటాడు. విజ యవాడలో గంజాయి అమ్ముతూ నగరబహిష్కర ణకు గురైన కరేమియా అనే వ్యక్తిని అనిల్ తన నివాసంలో ఉంచుకున్నాడు. అతడితో కలిసి తాడే పల్లి ప్రాంతంలో సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. మాట వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి అనిల్, అతడి సోదరుడు, కరే మియా కలిసి ఓ ఆడపిల్ల విషయమై ఓ వర్గం ఉం డే ప్రాంతానికి వెళ్లి గలాటా సృష్టించారు. ఇళ్లల్లో మగవాళ్లు లేకపోవడంతో మహిళలపై దాడికి తెగ బడ్డారు. మీ వాళ్లే అమ్మాయిని తీసుకెళ్లారంటూ రెచ్చిపోయారు. కరేమియా, అనిల్ తమ్ముడు ఒక మహిళను కర్రతో కొట్టడంతో ఆమె చేతులకు తీవ్ర గాయమైంది. కరేమియా గంజాయి మత్తులో చిన్న పిల్ల అని కూడా కనికరం లేకుండా కింద పడవేసి కాలితో తన్నాడు. ఎస్కే సమీరాబి అనే మహిళ కాళ్లు పట్టుకుని ప్రాధేయపడడంతో వదిలేశాడు. అందరినీ చంపేస్తామంటూ అనిల్ మహిళలను బెదిరించాడు. పోలీస్టేషన్‌కు వెళితే నరికేస్తామని హెచ్చరించారు. దీంతో మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇళ్లకు వెళ్లేందుకూ భయపడుతు న్నారు. న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఇదిలా ఉంటే మూడు నెలల క్రితం ఎస్కే బాజి అనే యువకుడిని మా తాలూకా అమ్మాయిని ప్రేమిస్తావురా అంటూ అనిల్ చితకబాదాడు. అతని వద్ద ఫోన్ లాక్కొని ఊరు వదిలిపెట్టి వెళ్లిపోవాలని హెచ్చరించాడు. అలాగే రెండు కుటుంబాల మధ్య గొడవలో తల దూర్చి తన మాట వినలేదని ఓ వ్యక్తిని పోలీసుల ముందే కొట్టి గాయపరిచాడు. పోలీసులు ఎవరైనా ప్రశ్నిస్తే పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుంటానని అనిల్ బెదిరిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు అనిల్‌పై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

## తుంగభద్ర డ్రెయిన్‌లో పడి మహిళా వలంటీర్ మృతి



అన్నవరపు మానస, (ఫైల్)

మన్నవ(చేబ్రోలు): పొన్నూరు రూరల్ మండల పరి ధిలోని మన్నవ గ్రామంలో మహిళా వలంటీర్ ప్రమాదవ శాత్తూ కాలువలో పడి మరణించిన ఘటన గురువారం జరిగింది. అన్నవరపు మానస(26) గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. ఉదయం స్థానికంగా ఉన్న తుంగభద్ర డ్రెయిన్‌లో దుస్తులు ఉతకటానికి వెళ్లి ప్రమాదవశాత్తూ పడిపోయింది. నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోతున్న మానసను స్థానికులు కాపాడటానికి యత్నించినా ఫలితం లేకపోయింది. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టిన అనంతనం వలంటీర్ మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంసభ్యులు, బంధు వులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘట నపై పొన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వలంటీర్ మానస మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## శనగ రైతుకు ఊరట

- కొనుగోలు కేంద్రాలతో గిట్టుబాటు ధర
- 15 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసిన ప్రభుత్వం



మణికేశ్వరం కొనుగోలు కేంద్రంలో శనగలు కాటా వేస్తున్న హమాలీలు

అద్దంకి: రైతు పండించిన పంటను తక్కువ ధరకు దళా రులు దోచుకుపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించింది. మండలానికి ఒకటి నుంచి రెండుకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నేరుగా రైతుల పంటలు కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేసింది. దీంతో రైతు మోములో ఆనందం నెలకొంది. గతంలో దళారి చెప్పిందే ధర. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు కట్టడం కోసం దళారి అడిగిన ధరకు రైతు పంటను విక్రయించాల్సిన పరిస్థితి ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుం టోంది. దళారుల దగాకు కళ్లెం వేసింది.

**మద్దతు ధరకు శనగల కొనుగోలు**

అద్దంకి నియోజకవర్గంలోని మండలాల్లో సాగుచేసిన పప్పు, శనగ పంటకు క్వింటా రూ.5,335 ధరను ప్రభుత్వం ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 15 రోజుల్లో రైతుల ఖాతాలకు నగదు జమ చేసింది. నియోజకవర్గంలో అత్యధికంగా జే పం గులూరు మండలంలో 4 వేల ఎకరాల్లో, అద్దంకి మం డలంలో 2000, కొరిశపాడు మండలంలో 2900 ఎక రాల్లో, సంతమాగులూరు మండలంలో అత్యల్పంగా 179 ఎకరాల్లో రైతులు పప్పు శనగ పంట సాగు చేశారు. వర్షాల ఆటుపోట్లలోనూ ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగుచేసిన సమయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ నమోదు చేసింది. పంట పండిన తర్వాత రైతుకు ఎకరాకు ఏడు క్వింటాళ్ల వంతున క్వింటాకు రూ.5,335 మద్దతు ధర ప్రకటిం చింది. అద్దంకి మండలంలో నాగులపాడు, మణికేశ్వ రం, జే పంగులూరు మండలంలో జే పంగులూరు, చం దలూరు, సంతమాగులూరులో కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేశారు. రైతుకు ఏడు క్వింటాళ్ల వం తున మణికేశ్వరంలో 2100, నాగులపాడులో 1300 క్వింటాలు, జే పంగులూరు సుమారు 2 వేల క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేసి పదిహేను రోజుల్లో రైతుల ఖాతాలకు సుమారు రూ.3.20 కోట్ల నగదు జమ చేశారు.

### మద్దతు ధర ప్రకటించడంతో రైతులకు మేలు

రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం, అదే రేటుకు కొనుగోలు కేం ద్రం ఏర్పాటు చేసి కొనుగోలు చేయడంతో రైతులకు మేలు జరిగింది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు గిట్టుబాటు ధర లభించిం ది. దళారులు సైతం దాదాపు అదే ధర చెల్లించి కొనుగోలు చేశారు.

– వెంకటకృష్ణ, ఏవో, అద్దంకి

## వడదెబ్బకు వ్యక్తి మృతి



గురజాల: తుమ్మల చెరువుకు చెందిన గుండా గురువులు(58) మృతి చెందిన సంఘటన గుర జాలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...భానుడు ప్రతాపా నికి గురై వడదెబ్బ తగిలి స్థానిక బస్టాండ్ సమీ పంలో కిందపడిపోయాడు. వెంటనే క్షతగా త్రుడిని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు గళ్ల చొక్కా, గళ్ల లుంగీ ధరించినట్లు తెలిపారు. మృతదేహం గురజాల సామాజిక ఆరోగ్య కేం ద్రంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



## ముమ్మరంగా 16వ నెంబరు గేటు పునర్నిర్మాణ పనులు

**మరో వారంలో పూర్తిచేస్తామంటున్న ఇంజనీర్లు**



కాంక్రీట్‌పై కూర్చోబెట్టే ఆమ్స్‌ను పైకెత్తుతున్న క్రాలర్ హెవీలోడెడ్ క్రేన్స్

అచ్చంపేట: ఆగస్టు 2021లో సంభవించిన కృష్ణానది వర దలకు కొట్టుకుపోయిన పులిచింతల ప్రాజెక్టు 16వ నెం బరు రేడియల్ గేట్ పునర్నిర్మాణ పనులు ప్రభుత్వ ఆదే శాల మేరకు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో పూర్తి చేస్తామని ప్రాజెక్టు ఇంజినీర్లు చెబు తున్నారు. బికేం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెం దిన ఇంజినీర్లు గేటు అమర్చి పనులలో నిమగ్నమ య్యారు. ఇందుకు అవసరమైన కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. 100 టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్‌హెవీ లోడెడ్ క్రేన్, 80టన్నుల సామర్థ్యం కలగిన టైర్‌మౌంటెడ్ క్రేన్స్ సహాయంలో గేటుకు రెండు వైపుల బిగించాల్సిన గేట్ ఆమ్స్‌ను కాంక్రీట్స్‌పై కూర్చోబెట్టే పనులు జరు గుతున్నాయి. అవి బిగిస్తేగాని 300 టన్నుల బరువుగల రేడియల్‌గేట్ అమర్చేందుకు అవకాశం ఉండదు. ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామకృష్ణ, ఈఈ శ్యాంప్రసాద్, డీఈ అరుణకుమారి, ఏఈలు విక్రమ్, వెంకటరెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు.

## కారు, ఆటో ఢీ.. వ్యక్తి మృతి

**ఇరువురికి గాయాలు**



ప్రమాదంలో మృతి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావు

చినగంజాం: ఎదురెదురుగా కారు, ఆటో ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా, ఇరువురికి గాయాలయ్యాయి. ఈఘటన గురువారం చినగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలో కడవకుదురు గ్రామ సమీపంలో చోటుచే సుకుంది. ఎస్ఐ కే సురేష్ తెలిపిన వివరాల మేరకు.. కడవకుదురు గ్రామానికి చెందిన పలువురు బేల్దారి కూలీలు ప్రతిరోజూ పనుల నిమిత్తం ఇంకొల్లు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో గురువారం పని ముగిం చుకొని ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నారు. కడవకు దురు గ్రామ సమీపంలో రొంపేరు వంతెన దాటే సమ యానికి అదే మార్గంలో కడవకుదురు నుంచి ఎదు రుగా వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో ఆటోలో ప్రయాణిస్తున్న పూలవారిపాలెం గ్రామా నికి చెందిన సోమిశెట్టి శ్రీనివాసరావు (51), కడవకు దురు గ్రామానికి చెందిన గడ్డం సుబ్బారావు, గడ్డం నాగేశ్వరరావులకు కాళ్లు విరిగాయి. గడ్డం నాగలక్ష్మి, లక్ష్మి, ఆటో డ్రైవర్ గాజుల అంజయ్య, పోలయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి చింతగుం పల గ్రామంలో వివాహ వేడుకకు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న ఇరువురు పురుషులు, మహిళలు సుర క్షితం కాగా, కారు డ్రైవర్ మాత్రం ఘటనా స్థలాం నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయాలపాలైన శ్రీనివాసరావును 108 వాహనంలో చీరాల వైద్యశా లకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద స్థలాన్ని ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. మృతి చెందిన శ్రీనివాసరావుకు భార్య, ఇరువురు కుమార్తెలు కాగా వారిరువురికి వివాహాల య్యాయి. కుటుంబానికి శ్రీనివాసరావు సంపాదనే ఆధారం కాగా, ఆధారం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయండి

**సామాజిక, సాధికారత కమిటీ సభ్యుడు తురకా నరసింహం**



కలెక్టర్ శివ శంకర్‌తో సమావేశమైన తురకా నరసింహం

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీ నవర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పల్నాడు జిల్లాలో సమర్థంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకో వాలని భారత ప్రభుత్వ సామాజిక, సాధికారిత కమిటీ సభ్యుడు తురకా నరసింహం జిల్లా అధికారులను ఆదేశిం చారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురు వారం కలెక్టర్ ఎల్.శివశంకర్‌ని ఆయన మర్యాదపూర్వకం గా కలిశారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు.

నూజెండ్ల మండలంలో మహిళా గ్రూపులను కలుపుకొని డెయిరీ డెవలప్‌మెంట్ పైలెట్ ప్రాజెక్ట్ కింద పెద్దఎత్తున పశువుల ద్వారా పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా పేద మహిళా గ్రూపులకు పెద్దఎత్తున ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ లక్ష్మయ్య, కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వాహణ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

IV
సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
12-5-2023



## ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్జెనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ-రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

# సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

# ‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

## శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి సహార్ది ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

## భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’





దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

# జై జైస్వాల్...

### 47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు


చహల్


యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.951 |
| చెన్నై | 12 | 7 | 4 | 1 | 15 | 0.493 |
| రాజస్తాన్ | 12 | 6 | 6 | 0 | 12 | 0.633 |
| ముంబై | 11 | 6 | 5 | 0 | 12 | -0.255 |
| లక్నో | 11 | 5 | 5 | 1 | 11 | 0.294 |
| బెంగళూరు | 11 | 5 | 6 | 0 | 10 | -0.345 |
| కోల్‌కతా | 12 | 5 | 7 | 0 | 10 | -0.357 |
| పంజాబ్ | 11 | 5 | 6 | 0 | 10 | -0.441 |
| హైదరాబాద్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.472 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 0 | 8 | -0.605 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

**ధనాధన్...**

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.



**1** ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

**187** ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రావో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

### స్కోరు వివరాలు

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1–14, 2–29, 3–77, 4–107, 5–127, 6–129, 7–140, 8–149. **బౌలింగ్:** బౌల్ట్ 3–0–15–2, సందీప్ శర్మ 4–0–34–1, అశ్విన్ 4–0–32–0, రూట్ 2–0–14–0, యజువేంద్ర చహల్ 4–0–25–4, ఆసిఫ్ 3–0–27–1.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1–30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1–0–26–0, హర్షిత్ రాణా 2–0–22–0, శార్దుల్ ఠాకూర్ 1.1–0–18–0, వరుణ్ చక్రవర్తి 3–0–28–0, సునీల్ నరైన్ 2–0–13–0, సుయశ్ 3–0–22–0, అనుకూల్ 1–0–20–0.

# సినిమా



**“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను” అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘కస్టడీ’. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.**

## ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

\- నాగచైతన్య

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామిగారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

**మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.**


**నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.**

## గేమ్ స్టార్ట్

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.


● అదాశర్మ

## ఓ సరదా ప్రయాణం


● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

## ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం

\- వీకే నరేశ్

‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్.ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్ఎస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్ఎస్ రాజు

## వాస్తవ ఘటనతో...


● నిష్కా, ఇషాన్, శక్తి

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహేంద్రా, నిష్కా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కత్రి మోహన్.

## హ్యాపీ ఎండింగ్


● యశ్ పూరి

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.

## హీరో ఆఫ్ ఇండియా!


● అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.